
కోడూరు - ఈదూరు రహదారి ఇలా..


పల్లె పండగలో భాగంగా నాసిరకంగా వేసిన కృష్ణారెడ్డిపాళెం సీసీ రోడ్డు


అధ్వానంగా ఉన్న గ్రామీణ ప్రాంత రహదారి

దారి అధ్వానం

తాము అధికారంలోకి వస్తే గుంతల్లేని రోడ్లు చూస్తామంటూ కూటమి పెద్దలు ప్రగల్భాలు పలికారు. ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు గడిచాక సంక్రాంతి కల్లా గుంతలు పూడ్చాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే మండలంలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. దారులన్నీ ఇంకా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.

- 'పల్లె పండగ' మాటలకే పరిమితం
- అడుగుకో గుంత.. తిరిగేదెట్టా..?
- నరకం చూస్తున్న గ్రామీణులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


కోడూరు బీచ్ రోడ్డు ఇలా..

తోటపల్లిగూడూరు: సంక్రాంతి నాటికి గ్రామీణ రహదారులకు కొత్తరూపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమం మాటలకే పరిమితమైంది. మండలంలోని 12 పంచాయతీల్లో రూ.1.15 కోట్లతో సీసీ రోడ్లను నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా గతేడాది అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు మండలంలో పల్లె పండగ వారోత్సవాలను చేపట్టారు. మంజూరైన నిధులతో పనులను ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యం.

అంతా మాటలే..

త్వరితగతిన గ్రామీణ రహదారులను బాగు చేసి సంక్రాంతి నాటికి పల్లెలను ముస్తాబు చేస్తామని కూటమి పెద్దలు ఘనంగా ప్రకటించారు. అయితే అవన్నీ నీటిమూటలుగానే మిగిలిపోయాయి. మండలంలో పలుచోట్ల ఆర్అండ్‌బీ రహదారులు దారుణంగా ఉన్నా వీటి మరమ్మతులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఇక పంచాయతీరాజ్ శాఖ నుంచి 17 పనులకు సంబంధించి రూ.1.15 కోట్లతో 2.85 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. సంక్రాంతి నాటికి పూర్తి కావాల్సిన ఈ పనులు ప్రస్తుతం 40 శాతానికి మించి జరగలేదు. కొన్నిచోట్ల అయితే పనులకు పునాదిరాళ్లు కూడా పడలేదు.

తీర ప్రాంత రహదారులు గుల్ల

తీర ప్రాంతంలోని వెంకన్నపాళెం, కొత్తపాళెం, పోట్లపూడి, కోడూరు, మాచర్లవారిపాళెం గ్రామాల్లోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. దుస్థితిలో ఉన్న ఈ రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు రూపురేఖలు కోల్పోయాయి. ముఖ్యంగా వరకవిపూడి నుంచి అనంతపురం వరకు ఉన్న తారు రోడ్డు గుల్లగుల్లగా తయారైంది. గుంతల్లో వర్షపు నీరు చేరిన సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ఈ మార్గాల్లో ప్రయాణమంటేనే హడలిపోవాల్సి వస్తోంది. సీఎస్‌పురం నుంచి గొల్లపాళెం వెళ్లే రహదారి దెబ్బతినడంతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. అలాగే నరుకూరు - కోడూరు మార్గంలో విలుకానుపల్లి సమీపంలో ఇటీవలే నిర్మించిన బీటీ రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో స్థానికులకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మహాలక్ష్మీపురం నుంచి కోడూరు బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో సందర్శకులతోపాటు ఇతర ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు.


ఛిద్రమైన నరుకూరు - కోడూరు ప్రధాన రహదారి

అంతా ఆర్భాటమే..


అధ్వానంగా పాటూరు - యల్లాయపాళెం రోడ్డు

- దుర్భరంగా రహదారులు
- నియోజకవర్గంలో 104 పంచాయతీ రోడ్లకు రూ.81 కోట్లు మంజూరు
- వీటిలో సగం చోట్లే పనులు

కోవూరు: రోడ్లను బాగు చేస్తున్నామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు అంతా ఆర్భాటంగానే మారుతున్నాయి. ఎక్కడా రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వాహనచోదకులు నానా పాట్లు పడుతున్నారు. నాణ్యత కరువవడంతో అనతి కాలంలోనే దుర్భరంగా తయారవుతున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో 104 పంచాయతీ రోడ్లకు గానూ రూ.81 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తోంది. ఫలితంగా వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో బాగున్న సిమెంట్ రోడ్లపైనే నూతనంగా నిర్మిస్తున్నారు. అవసరమైన చోట వేయడాన్ని విస్మరిస్తున్నారు. నియోజకవర్గంలో బీటీ రోడ్ల మరమ్మతులు, గుంతలు పూడ్చే ప్రక్రియ సంక్రాంతిలోపు పూర్తయ్యే అవకాశాలు ఏ మాత్రం కనిపించడంలేదు.

అంతా పైపైనే..

నియోజకవర్గంలో 31 రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు రూ.2.5 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 144 కిలోమీటర్ల పొడవున ఉన్న రోడ్లపై పనులు చేపట్టాల్సి ఉంది. అయితే పైపైనే వీటిని ముగిస్తున్నారు. బిల్లు మంజూరయ్యే వరకు రోడ్డు బాగుంటే చాలా.. తర్వాత తమకేమనే రీతిలో కూటమి పార్టీల నేతలు, కాంట్రాక్టర్ల వ్యవహరిస్తున్నారు. రోడ్లపై గుంతలు పూడ్చుతుండగా, మరోవైపు మళ్లీ గోతులు పడుతుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది.


వేగూరు కాలువ నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు ఇలా..

క్లుప్తంగా

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు చేశారు.

రేషన్ డీలర్‌పై విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్ఐ

మనుబోలు: కొమ్మలపూడి గ్రామ రేషన్ డీలర్‌పై బుధవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. డీలర్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని, దీనిపై సమాధానం కూడా చెప్పడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సుబ్బయ్య విచారణకు ఆదేశించారు. దీంతో ఆర్ఐ నారాయణ, వీఆర్వో గుణశేఖర్ రేషన్ దుకాణానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న సోమిరెడ్డి

పొదలకూరు: భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ అనూష, తహసీల్దార్ బి.శివకృష్ణ, ఎంపీడీఓ డీవీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 21 అర్జీలు

ముత్తుకూరు: మండలంలోని పొట్టెంపాడు గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానికుల నుంచి అధికారులకు 21 అర్జీలు వచ్చాయి. మండలంలో సదస్సులు ముగిశాయని డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ వెల్లడించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్, వీఆర్వో, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో ఉచిత పశు వైద్యశిబిరం


నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న వైద్యులు

వెంకటాచలం: మండలంలోని కంటేపల్లి గ్రామంలో బుధవారం మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వెంకటాచలం పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ వైద్యులు శ్రీనివాసులునాయుడు గేదెలకు వైద్యపరీక్షలు చేశారు. పాడిరైతులకు సూచనలిచ్చారు. నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ సుగుణమ్మ, రైతులు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

విడవలూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయకపోతే సహించేది లేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. మండలంలోని సమస్యలపై అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను అడిగి తెలుసుకున్నారు. వీటిని త్వరగా పరిష్కరించాలని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేసేందుకు సహకరించాలని చెప్పారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్‌కుమారి, వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని రేబాల గ్రామంలో యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని జెడ్పీటీసీ సభ్యుడు శివరామకృష్ణారెడ్డి, రియాజ్, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోమశేఖర్, హఫీజ్, చెంచయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీపీ


జగన్‌తో ప్రసన్న, శ్రీనివాసులురెడ్డి


వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ

ముత్తుకూరు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముత్తుకూరు ఎంపీపీ గండవరం సుగుణ బుధవారం కలిశారు. తాడేపల్లిలో జరిగిన జిల్లా నాయకుల సమావేశానికి హాజరైన ఆమెను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పార్టీ అధినేతకు పరిచయం చేశారు. ఇంకా జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటరమణయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్ తదతర నాయకులు వైఎస్ జగన్‌కు పూలబొకేలు అందజేశారు.

- **ఇందుకూరుపేట:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని స్థానిక సంస్థల నేతలతోపాటు మండలంలోని పలువురు ముఖ్య నేతలు కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, ఎంపీపీ గంధళ్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలు రేపు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. తెల్లవారుజామున ధనుర్మాస పూజలు, 9 గంటలకు గరుడసేవ ఊరేగింపు, సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి కల్యాణం, రాత్రి 7 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

- పట్టణంలోని అయ్యప్పనగర్‌లో శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. గీతామందిరంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

పాటూరు హైస్కూల్లో శుభ్ దిన్ భోజన్



కోవూరు: మండలంలోని పాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుభ్ దిన్ కా భోజన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పల్లా భరత్ జన్మదినాన్ని పురస్కరించుకొని పెండెం వెంకటశేషయ్య, రాజేశ్వరి ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు, ఉపాధ్యాయులు జుల్ఫికర్ అలీ అహ్మద్, స్టాఫ్ సెక్రటరీ కోవూరు కాలేబు, సీనియర్ ఉపాధ్యాయులు పర్వతరెడ్డి జనార్దన్‌రెడ్డి, మారెళ్ల చంద్రమోహన్, వెంకటరమణ, శేషయ్య, ఫిజికల్ డైరెక్టర్ భీమతాటి వెంకటరమణయ్య, ఉమామహేశ్వరి, మెట్టుకూరు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సభ్యులతో సమావేశం

నెల్లూరు రూరల్: రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఐఆర్సీఎస్ నిబంధనల మేరకు పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని తన చాంబర్‌లో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనేజింగ్ కమిటీ కోరం లేకపోతే రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు.

యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పుదుచ్చేరిలో నిర్వహించిన యోగా పోటీల్లో నెల్లూరుకు చెందిన క్రీడాకారిణి గుంజి కావ్యశ్రీ ప్రథమ స్థానాన్ని సాధించారు. ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి మురళీధరన్, స్పీకర్ సెల్వం చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


తోటపల్లిగూడూరు: పోస్టర్ల ఆవిష్కరణ


వెంకటాచలం: మాట్లాడుతున్న విజయలక్ష్మి

వెంకటాచలం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి కోరారు. వెంకటాచలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేస్తే బాలికలు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ సుబ్బారావు, ఎంఈఓ శ్రీనివాసులురెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు:** కిశోరి వికాశం కార్యక్రమంపై బుధవారం మండల కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం అధికారులు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి, ఎంఈఓ వేణుగోపాలరెడ్డి, వెలుగు ఏపీఎం విజయలక్ష్మి, వరిగొండ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



కొడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో రైతులకు వరిలో సామూహిక ఎలుకల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మి మాట్లాడుతూ ఎలుకల నివారణ రైతులంతా సామూహికంగా చేబడితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. పంటల బీమాను ఈనెల 15వ తేదీ వరకూ గడువు పొడగించినందున బ్యాంక్‌లో రుణాలు పొందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ జి.ఉమామహేష్, సొసైటీ సీఈఓ జి.వంశీకృష్ణ, నాయకుడు వై.వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల వెతలు పట్టవా..!


బకెట్లతో నీటిని తీసుకెళ్తున్న విద్యార్థినులు

కూటమి పెద్దలు ప్రభుత్వ బడులపై చిన్నచూపు చూస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నీటి సమస్య వేధిస్తోంది. ఇక్కడ చాలారోజులుగా తాగునీటికి ఇబ్బందులుండగా ఉపాధ్యాయులే క్యాన్ వాటర్‌ను తెప్పిస్తున్నారు. కాగా స్కూల్లో ఉన్న బోరు పనిచేయకపోవడం, దీనితోడు ఇటీవల ప్రహరీ కూల్చివేత ఘటనలో వాటర్ ట్యాంక్ కూడా దెబ్బతినడంతో నీటి సమస్య తీవ్ర తరమైంది. ఫలితంగా విద్యార్థినులు డ్రమ్ముల్లో నింపిన నీటిని బకెట్లలో తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక మధ్యాహ్న భోజన సమయంలో అయితే తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

– పొదలకూరు